సాక్షి కామారెడ్డి

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



టీచర్ల పాత్ర కీలకం

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



మూల మలుపుల్లో..

మూల మలుపుల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వాటిని తొలగించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.7 /22.6

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రాజంపేట ఎస్సైపై వేటు

కామారెడ్డి క్రైం: విధుల్లో అలసత్వం వహించిన రాజంపేట ఎస్సై దత్తాద్రిగౌడ్‌పై వేటు పడింది. గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఆయనను ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఎస్సై ఎన్ రాజుకు రాజంపేట ఎస్సైగా అటాచ్‌మెంట్ ఇచ్చారు.

ఇద్దరు హోంగార్డులపైనా..

దేవునిపల్లి పీఎస్‌లో పనిచేస్తున్న హోంగార్డు మొగులయ్య గతనెల 25 నుంచి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతూ రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటున్నాడని తేలడంతో సస్పెండ్ చేశారు. కామారెడ్డిలో ఇటీవల జరిగిన గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డు సత్యనారాయణకు విధులు కేటాయించారు. అతడు విధులకు గైర్హాజరు కావడంతో సస్పెన్షన్ వేటు పడింది.

'విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి'



కామారెడ్డి అర్బన్: నిజాం నిరంకుశ పాలన అంతమైన సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశమై తెలంగాణ విమోచన దినోత్సవంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. 17 పోలింగ్ బూత్ స్థాయిలో జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. ఆరోజు నుంచి గాంధీ జయంతి వరకు రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు రంజిత్‌మోహన్, కిషన్‌రావు, శ్రీకాంత్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తేలిన ఓటర్ల లెక్క

కామారెడ్డి అర్బన్: జిల్లాలో పరిషత్ ఓటర్ల లెక్క తేలింది. 25 మండలాల్లో 233 ఎంపీటీసీ, 25 జెడ్పీటీసీ స్థానాలుండగా.. వాటి పరిధిలో 6,39,730 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్లు 3,07,508 మంది, మహిళలు 3,32,209 మంది, ట్రాన్స్‌జెండర్లు 13 మంది ఉన్నారు. మొత్తం 1,259 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



కామారెడ్డి -సిరిసిల్ల రహదారిపై స్పీడ్ గన్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

వేగంగా చలానా!

అతి వేగంగా వాహనాలను నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వేగ నియంత్రణకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. జాతీయ రహదారులతోపాటు రాష్ట్రీయ రహదారిపై స్పీడ్ లేజర్ గన్‌లు ఏర్పాటు చేసింది. వేగ పరిమితి దాటితే ఈ గన్ పసిగట్టి వెంటనే చలానా జారీ చేస్తుంది. ఈ చర్యతో వాహనాల వేగానికి కళ్లెం పడుతుందని భావిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- వాహనాల స్పీడుకు కళ్లెం వేసేందుకు పోలీసుల చర్యలు
- ప్రధాన రహదారులపై పలుచోట్ల స్పీడ్ లేజర్ గన్‌ల ఏర్పాటు
- ప్రమాదాల నివారణ కోసమేనంటున్న అధికారులు

ప్రధాన రహదారులపై వెళుతున్నపుడు చాలా మంది అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులపై యూటర్న్‌ల దగ్గర ముందూ, వెనకా చూసుకోకుండా రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రాంగ్ రూట్‌లో వెళ్లి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం మూలంగా కింద పడినప్పుడు తలకు గాయాలై చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు, తీవ్ర గాయాలతో ఆస్పత్రులపాలైన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపడుతోంది. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానాలు విధిస్తోంది. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. మద్యం సేవించి వాహనం నడిపితే పోలీసులు పట్టుకుని రిమాండుకు పంపుతున్నారు. ఇటీవలి కాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పలువురికి ఒకటి, రెండు రోజులు జైలు శిక్షలు పడడమే ఇందుకు నిదర్శనం. అలాగే వాహనాల వేగానికి కళ్లెం వేయడానికి స్పీడ్ గన్‌లను వాడుతోంది. వేగ పరిమితి దాటితే స్పీడ్ గన్ రికార్డు చేసి, చలానా జారీ చేస్తుంది.

తగ్గుతున్న ప్రమాదాలు..

జిల్లా ఎస్పీగా రాజేశ్ చంద్ర బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడేవారికి జరిమానాలు, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో చర్యలు తీసుకుంటుండడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఆగస్టు చివరి నాటికి జిల్లాలో 188 రోడ్డు ప్రమాదాలు జరిగితే ఈ ఏడాది ఆగస్టు నాటికి 145 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలు 22.9 శాతం తగ్గాయని చెబుతున్నారు. అలాగే రోడ్డు ప్రమదాలలో మరణాల సంఖ్య గతేడాది 197 ఉండగా, ఈ ఏడాది 153కు తగ్గిందంటున్నారు. మరణాల శాతం 22 శాతం తగ్గిందని పేర్కొంటున్నారు.

మూడు చోట్ల..

జిల్లాలో మూడు ప్రధాన రహదారులపై స్పీడ్ లేజర్ గన్‌లు ఏర్పాటు చేశారు. ఈనెల 8న 44వ నంబరు జాతీయ రహదారిపై సదాశివనగర్‌లోని అయ్యప్ప మందిరం వద్ద ఒక స్పీడ్ లేజర్ గన్‌ను ప్రారంభించారు. దీనిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. 161వ నంబరు జాతీయ రహదారిపై ఒకటి, 16వ నంబరు రాష్ట్రీయ రహదారి (కేకేవై రోడ్డు)పై మరో స్పీడ్ లేజర్ గన్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

'హద్దు'దాటితే ఆటోమెటిక్‌గా ఫైన్..

వేగంగా వెళ్తున్న వాహనాన్ని కొంత దూరం నుంచే స్పీడ్ లేజర్ గన్ క్యాచ్ చేస్తుంది. ఆయా రోడ్లపై వెళ్లాల్సిన వేగం కన్నా ఎక్కువ వేగంతో వెళుతుంటే వెంటనే సదరు వాహన నంబరు ఆధారంగా యజమాని మొబైల్ నంబర్‌కు చలానా సందేశాన్ని పంపిస్తుంది. వేగంగా దూసుకువెళ్లేవారు ఎంతటి వారైనా సరే స్పీడ్ లేజర్ గన్ నుంచి తప్పించుకునే పరిస్థితి ఉండదు. జిల్లా పోలీసు శాఖ ఆయా రోడ్లపై ఏర్పాటు చేసిన స్పీడ్ గన్‌లను ఒకేచోట కాకుండా రోజూ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తూ వేగంగా వెళ్లే వాహనాలకు జరిమానా విధిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాహనదారుల్లో మార్పు వస్తుందని, పరిమిత వేగంతో వాహనాన్ని నడుపుతారని పోలీసులు పేర్కొంటున్నారు.

నిబంధనలు పాటించాలి



రోడ్డు మీద జాగ్రత్తగా వెళ్లాలి. ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రులపాలైనా, ప్రాణాలు కోల్పోయినా కుటుంబం రోడ్డున పడుతుంది. ఈ విషయాన్ని మరచిపోవద్దు. ప్రమాదాల బారిన పడకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిమిత వేగంతో వెళ్లడం, హెల్మెట్ ధరించడం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

– రాజేశ్‌చంద్ర, ఎస్పీ

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

- రెండు రోజుల్లో పరిహారం అందించాలి
- లేకపోతే బీసీ సభను అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు రెండు రోజుల్లో నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. లేకపోతే ఈనెల 15న కామారెడ్డిలో నిర్వహించే బీసీ సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఎల్లారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన పర్యటన రైతులను పరామర్శించడానికి వచ్చినట్లుగా కాకుండా విహారయాత్రకు వచ్చివెళ్లినట్లుగా సాగిందని విమర్శించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మొదటిసారి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. వంద కోట్లతో కూడిన ప్రత్యేక ప్యాకేజీ ఇస్తారనుకుంటే పది రూపాయలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన బోర్ మోటార్లు వరదలో కొట్టుకుపోయాయని, వారికి వెంటనే ప్రభుత్వం కొత్త మోటార్లు అందజేయాలని కోరారు. బీసీల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ.. ఓట్ల కోసమే బీసీ సభ పేరిట కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జలందర్‌రెడ్డి, సతీష్, ముదాం సాయిలు, కపిల్ రెడ్డి, నర్సింలు, సతీష్, ఇమ్రాన్, అరవింద్ గౌడ్, పృథ్వీరాజ్, గంగారెడ్డి, మనోజ్, బర్కత్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు




అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో ఈనెల 15 న నిర్వహించే సీఎం సభకు సంబంధించి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ రాజేశ్ చంద్ర అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలో సీఎం సభ నిర్వహించే ప్రాంతం, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో సూచిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, సీఐలు నరహరి, రామన్ తదితరులు పాల్గొన్నారు.




రామారెడ్డిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఎన్నాళ్లీ పాట్లు..



మాచారెడ్డి సింగిల్‌విండో వద్ద క్యూలో రైతులు



బీబీపేటలో ఘర్షణ పడుతున్న రైతులు

- యూరియా కోసం తప్పని తిప్పలు
- అరకొరగానే సరఫరా
- పోలీసుల పహారా మధ్య పంపిణీ

భిక్కనూరు/మాచారెడ్డి/బీబీపేట/రాజంపేట/సదాశివనగర్/రామారెడ్డి: రోజులు గడుస్తున్నా యూరియా సమస్య పరిష్కారం కావడం లేదు. బస్తా ఎరువు కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. బుధవారం భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట, సదాశివనగర్, రామారెడ్డి మండలాల పరిధిలోని సొసైటీలలో యూరియా పంపిణీ చేశారు. బస్తాలు తక్కువగా ఉండడం, రైతులు ఎక్కువగా ఉండడం భారీ బారులు కనిపించాయి. బారెడు లైన్లలో గంటల తరబడి నిలబడే ఓపిక లేక చెప్పులు, చెట్ల కొమ్మలు, రాళ్లు.. ఎలా ఏవి కనిపిస్తే అవి లైన్లలో ఉంచి పక్కన వేచి ఉన్నారు. పోలీసు పహారా మధ్య యూరియాను పంపిణీ చేశారు.

బీబీపేటలో రైతుల ఘర్షణ..

బీబీపేట సొసైటీ వద్ద ఉదయంనుంచే రైతులు బారులు తీరారు. గంటల తరబడి నిలబడాల్సి రావడంతో ఒకరినొకరు తోసుకున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు సోమారంపేట గ్రామంలో, పాల్వంచ మండలం భవానీపేట, ఎల్పుగొండలలో యూరియా పంపిణీ చేశారు. మాచారెడ్డి సింగిల్ విండోకు 450 బస్తాలు రాగా.. రైతులు ఎగబడి బస్తాలు తీసుకువెళ్లారు. చాలామందికి ఎరువు దక్కలేదు. భవానీపేటలో 220 బస్తాలే రావడంతో వందలాది మందికి నిరాశే ఎదురయ్యింది. సోమారంపేటలో ఉదయమే వచ్చి కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. చివరికి యూరియా రాకపోవడంతో నిరసన తెలిపి, నిరాశతో వెళ్లిపోయారు. రామారెడ్డి, సదాశివనగర్ మండలాల్లోనూ తెల్లవారకముందు నుంచే రైతులు యూరియా కోసం లైన్లు కట్టారు.

కాచాపూర్‌లో వాగ్వాదం..



కాచాపూర్‌లో వాగ్వాదానికి దిగిన రైతులు

భిక్కనూరు మండల కేంద్రంలోని సింగిల్‌విండోకు 444 బస్తాలు, కాచాపూర్‌కు 200 బస్తాల యూరియా వచ్చింది. కాచాపూర్‌లో యూరియా విక్రయాలు ప్రారంభం కాగానే రైతులు ఒక్కసారిగా మీదపడడంతో సిబ్బంది ఇబ్బందిపడ్డారు. రైతులు ఒకరినొకరు తోసుకున్నారు. ఈ క్రమంలో రైతులు వాగ్వాదానికి దిగారు. రాజంపేట మండలం తలమడ్లలో ఉదయం 5 గంటలనుంచే క్యూ కట్టారు. క్యూలైన్‌లో చెప్పులు ఉంచి పక్కన వేచి ఉన్నారు. 200 బస్తాల యూరియా మాత్రమే రావడంతో మిగతా రైతులు నిరసన తెలిపారు.



సదాశివనగర్‌లో బారులు తీరిన రైతులు



రాజంపేటలో క్యూలో చెప్పులు ఉంచిన రైతులు

మరోసారి ఉగ్ర కలకలం

- బోధన్‌లో హాజీయమన్‌ను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ ఎన్ఐఏ బృందం
- ఉలిక్కిపడుతున్న జిల్లా ప్రజానీకం
- గతంలో బంగ్లాదేశీయులకు అక్రమంగా పాస్‌పోర్టులు జారీ చేసిన వైనం
- 2022లో జిల్లా కేంద్రంలో ఉగ్ర సంస్థ శిక్షణ శిబిరాన్ని కనుగొన్న ఎన్ఐఏ, పోలీసులు
- అనంతరం పీఎఫ్ఐపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో మరోసారి ఉగ్ర మూలాలు కలకలం సృష్టించగా ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. తాజాగా బుధవారం బోధన్ పట్టణానికి చెందిన హాజీయమన్‌ను ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్ఐఏ పోలీసులు అరెస్టు చేసి విచారణ నిమిత్తం ఢిల్లీకి తీసుకెళ్లారు. ఐసిస్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులను జార్ఖండ్ రాజధాని రాంచీలో ఎన్ఐఏ అరెస్టు చేసి విచారణ చేసిన సమయంలో బోధన్‌కు చెందిన హాజీయమన్ పేరు బయటకు వచ్చింది. హాజీయమన్ గత కొంతకాలంగా అంతర్జాతీయ ఫోన్‌కాల్స్ ఎక్కువగా మాట్లాడుతుండడాన్ని ఎన్ఐఏ గుర్తించింది. ఇతని ఇంట్లో ఎయిర్ గన్‌ను ఎన్ఐఏ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోధన్ కోర్టులో హాజరుపరిచి, విచారణ నిమిత్తం హాజీయమన్‌ను ఢిల్లీకి తీసుకెళ్లారు. ఐసిస్‌తో సైతం లింకులు ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నారు.

■ బోధన్ పట్టణంలో నకిలీ చిరునామాలతో 2018లో బంగ్లాదేశీయులకు అక్రమ పద్ధతిలో 74 పాస్‌పోర్టులు జారీ చేశారు. ఈ విషయమై అప్పటి స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐలు మల్లేష్, అనిల్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు తరువాత బోధన్‌కు వచ్చిన వ్యక్తులకు అక్రమంగా పాస్‌పోర్టులు జారీ చేసే విషయంలో ఈ ఇద్దరు ఏఎస్ఐలు కీలక పాత్ర పోషించడం గమనార్హం. బోధన్‌లోని ఒకే ఇంటి నంబర్ మీద 24 పాస్‌పోర్టులు ఇవ్వడం అప్పట్లో సంచలనం కలిగించింది. అలాగే ఇతర అద్దె ఇంటి నంబర్లపై సైతం ధ్రువీకరణలు సృష్టించి పాస్‌పోర్టులు జారీ చేయించారు. తరువాత కాలంలో బోధన్‌లో రోహింగ్యాలకు ఆధార్ కార్డులు సైతం జారీ చేయడం గమనార్హం.

శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్‌తో..

నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో 2022 జూలై 4న పీఎఫ్ఐ సభ్యుడు, శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్‌తో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అబ్దుల్ ఖాదర్ డైరీ, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్ ఖాదర్ అరెస్ట్ తర్వాత నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో ముగ్గురు పీఎఫ్ఐ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశం సమాచారంతో పోలీసులు పీఎఫ్ఐ జిల్లా కన్వీనర్ షేక్ షాదుల్లాను, నగరానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ అబ్దుల్లాను అదుపులోకి తీసుకుని విచారించారు. శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ వద్ద దొరికిన డైరీలోని వివరాలతో విచారణ చేపట్టారు. జిల్లాలో 200 మందికి పైగా శిక్షణ తీసుకోగా, ఇందులో 23 మంది కీలక సభ్యులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తెలంగాణలో నిజామాబాద్, ఆంధ్రప్రదేశ్‌లో కడప బేస్ క్యాంపుగా ఏర్పాటు చేసుకుని పీఎఫ్ఐ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. విచారణలో పీఎఫ్ఐ ఒక వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఎన్ఐఏకు లేఖ రాశారు. ఎన్ఐఏకు చెందిన ఉన్నత స్థాయి అధికారి జిల్లా పోలీసులతో సమావేశమయ్యారు. కేసులో తీవ్రతను గుర్తించిన ఎన్ఐఏ 2022 ఆగస్టు 26న పీఎఫ్ఐ కేసును తీసుకుంది. ఎన్ఐఏ అధికారులు నలుగురిని విచారించిన తరువాత సెప్టెంబర్ 18న నిజామాబాద్‌తోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. సోదాల్లో ల్యాప్‌ట్యాప్‌లు, ఎలక్ట్రిక్ వస్తువులు, సెల్ ఫోన్లలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు లభించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నలుగురిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. వారిచ్చిన సమాచారంతో పాటు ఎన్ఐఏ సేకరించిన సమాచారం మేరకు దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. 170 మందిని అరెస్ట్ చేయడంతో పాటు విదేశాల నుంచి రూ.120 కోట్లు సేకరించినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. సిమి నుంచి పీఎఫ్ఐగా మారిన ఈ సంస్థకు ఐసిస్, లష్కరేతోయిబా సంస్థలతోనూ సంబంధాలు ఉన్నట్లు తేలింది.

తీగ లాగితే కదిలిన డొంక

నిషేధిత సిమి (స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా) నుంచి పీఎఫ్ఐ (పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా)గా రూపాంతరం చెందిన ఉగ్ర సంస్థ శిక్షణ కేంద్రాన్ని 2022లో నిజామాబాద్‌లో కనుగొన్నారు. ఈ శిక్షణ కేంద్రంలో వివిధ రకాలుగా హత్యలు ఎలా చేయడం, మతకలహాలు సృష్టించే విషయాలపై శిక్షణ ఇచ్చారు. దక్షిణాదిలో కీలకమైన బేస్‌క్యాంప్‌గా నిజామాబాద్ ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. 2022 జూలై 4న నిజామాబాద్‌లో పీఎఫ్ఐ శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్టుతో దేశవ్యాప్తంగా డొంక కదిలింది. తరువాత జూలై 6న మరో ముగ్గురిని నిజామాబాద్‌లో అరెస్టు చేశారు. సెప్టెంబర్ 18న మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మొత్తం 23 మందిపై జిల్లాలో కేసులు నమోదు చేశారు. ఆర్మూర్‌కు చెందిన నవీద్ అనే వ్యక్తిని సైతం ఎన్ఐఏ విచారించింది. అదేక్రమంలో దేశవ్యాప్తంగా 106 చోట్ల వివిధ రాష్ట్రాల్లో సోదాలు చేసిన ఎన్ఐఏ మొత్తం 170 మందిని అరెస్టు చేసింది. పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలన్నింటిపైన కేంద్రం యూఏపీఏ చట్టం కింద నిషేధం విధించింది.

క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఇద్దరు క్రీడాకారుల ఎంపిక


ఆనంద్


పరశురాం

కామారెడ్డి అర్బన్: జాతీయ స్థాయి 36వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కామారెడ్డి జిల్లా క్రీడాకారులు ఇద్దరు ఎంపికయ్యారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో కె.ఆనంద్ జావెలిన్‌త్రో, జి.పరశురాం డెకాథ్లాన్‌లో ప్రతిభ చూపి ఈనెల 23, 24, 25 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు.

ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేయాలి

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి



భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అంతంపల్లిలో ఇటీవల దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఫసల్ బీమా పథకం అమలులో ఉంటే రైతుల పంటలకు బీమా వర్తించేదని..అమలు చేయకపోవడం వల్ల రైతులకు ప్రతి ఏడాది నష్టం కలుగుతుందన్నారు. అలాగే యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీకేఎస్ మండలాధ్యక్షుడు నాగర్తి మల్లేష్‌రెడ్డి, అలకొండ గంగారెడ్డి, సాయిరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని మించినది లేదు

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



భిక్కనూరు: ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి వేరేది లేదని గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో 15 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదర్శ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మేధావులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ రోజా, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులున్నారు.

తైబజార్ కాదు.. హఫ్తా వసూల్

- పిట్లం మేకల సంతలో వసూళ్ల పర్వం
- రసీదులు ఇవ్వని వైనం
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు, దుకాణదారులు, వ్యాపారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


పిట్లం సంత

పిట్లం(జుక్కల్): పిట్లంలో తైబజార్ పేరుతో వసూళ్ల మాఫియా బరితెగించింది. సంతలలో తైబజార్ రసీదులు ఇవ్వకుండానే వ్యాపారస్తులు, దుకాణదారుల నుంచి తైబజార్ నిర్వాహకులు దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరి తీరు సంతలో తైబజార్ వసూల్‌లా లేదు హఫ్తా వసూల్‌లా ఉందని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇలా జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పిట్లం మేకల సంత, పిట్లం తైబజారు వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. తైబజారు వేలం పాట నిర్వహించే సమయంలో రోజువారీ సంత, పశువుల దాఖాలు, గొర్రెలు, మేకలకు రేట్లను నిర్ణయించి ఇంతే వసూలు చేయాలని కాంట్రాక్టర్‌కు అధికారులు సూచించారు. పంచాయతీ అధికారులు నిర్ణయించిన రేట్లనే కాంట్రాక్టర్ వసూలు చేయాలి. కానీ తైబజారు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరో కొంత మంది ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని ఇష్టం వచ్చినట్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరు సంతలో దుకాణదారులు, వ్యాపారులకు తైబజార్ రుసుము రసీదులు ఇవ్వకుండా ఒకటికి రెండింతలు డబ్బు లు వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న గ్రామాల నుంచి చిన్నాచితక రైతులు సంతలో కూరగాయలు అమ్ముకోడానికి వస్తుంటారు. అందులో కొంత లాభం రాకున్న వారు నష్టపోయినా సరే వారి వద్ద నిర్ణయించిన దాని కంటే అధికంగా తైబజార్ వసూల్ చేస్తున్నారు. అధికంగా తైబజార్ వసూల్ చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా సంతలో పంచాయతీ అధికారులు నిర్ణయించిన రేట్ల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

అతిగా చల్లితే అనర్థమే

- విపరీతంగా రసాయన ఎరువుల వాడకం
- దీంతోపాటు రైతులకు పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- వాడొద్దంటున్న వ్యవసాయ అధికారులు

రామారెడ్డి: కొన్నేళ్లుగా పంట పొలాల్లో రసాయన ఎరువుల వాడకం చాలా పెరిగిపోయింది. మోతాదుకు మించి ఎరువుల వాడకం ద్వారా భూసారం తగ్గిపోవడమే కాకుండా పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయి. ఎక్కువ మొత్తంలో ఎరువులు వాడితే పంటలకు కూడా అనర్థమే. అంతేకాకుండా అధిక ఎరువుల వాడకం ద్వారా పర్యావరణంపైన ప్రభావం చూపుతుంది. నీళ్లలో కరిగిపోకుండా ఎండిపోయి చెరువులు, నదుల్లో కలిసి నీటిని కలుషితం చేయడంతో పాటు గాలిని కూడా విషతుల్యం చేస్తుంది.వానాకాలం సీజన్ కావడంతో జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అత్యధికంగా ఖరీఫ్‌లో 3.18 లక్షల ఎకరాల్లో వరి , 34 వేల 459 ఎకరాల్లో పత్తి పంట, 84 వేల 220 ఎకరాల్లో సోయా సాగు అవుతుందని అంచనా వేశారు.

ఎక్కువగా వాడితే నష్టాలు..

పత్తి చేనులో యూరియా ఎక్కువగా వాడితే ఆకులు పెరిగి దిగుబడి పడిపోతుందని వరిలోనూ అధికంగా యూరియా వేస్తే ఏపుగా పెరిగి కోత కంటే ముందే నేలపై వాలిపోతుంది. పంటలో రోగాలు వచ్చి చీడపీడలు సమస్య ఎక్కువ అవుతుంది. భూమిలో జింక్ మెగ్నీషియం లోపం ఏర్పడుతుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. ఖర్చులు పెరిగి రైతులు అప్పులపాలవుతారు. ఎకరం పంటలో నత్రజని యూరియా భాస్వరం పొటాష్ 4:2:1 నిష్పత్తిలో వాడాల్సి ఉండగా ప్రస్తుతం రైతులు దీనికి మించి 100 శాతం ఎక్కువగా వాడుతున్నట్లుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

మోతాదుకు మించి వాడొద్దు

పంట పొలాలకు మోతాదుకు మించి ఎరువులు వాడటం వల్ల పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. రైతులపై పెట్టుబడి భారం కూడా పెరుగుతుంది. ఎరువుల వాడకంపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

– భాను శ్రీ, ఏవో, రామారెడ్డి

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



బాన్సువాడ: బాన్సువాడ – పిట్లం రోడ్డుకు మరమ్మతులు చేయాలని బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బాన్సువాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు బాన్సువాడ– పిట్లం రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. హైదరాబాద్‌కు వెళ్లే వారు చాలా మంది బాన్సువాడ–పిట్లం హైవే మీదుగా వెళ్తున్నారని, వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందజేశారు.

అల్ప్రాజోలం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని గోశాల రోడ్డులో అల్ప్రాజోలం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విలాస్ తెలిపారు. వివరాలు.. నగరంలోని కోజకాలనీకి చెందిన అబ్దుల్ మాలిక్ అనే వ్యక్తి కల్లు తయారీలో వాడే అల్ప్రాజోలంను గోశాల రోడ్డు గుండా తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో 609 గ్రాముల అల్ప్రాజోలం, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వరద బాధిత విద్యార్థులకు ఏబీవీపీ చేయూత


గిఫ్ట్ ఏ నోట్‌బుక్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గిఫ్ట్ ఏ నోట్ బుక్ పోస్టర్‌ను బుధవారం ఎస్పీ రాజేష్ చంద్ర ఆవిష్కరించారు. కొద్ది రోజుల క్రితం కామారెడ్డిలో వరదల కారణంగా విద్యార్థుల పుస్తకాలు వాటికి సంబంధించిన స్టేషనరీ వస్తువులు కొట్టుకుపోయాయి. వారికి చేయూతను అందించడానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో గిఫ్ట్ ఏ నోట్ బుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని ప్రయివేట్ స్కూళ్లు, కళాశాలలు ఒక పెన్ను, ఒక నోట్ బుక్, పెన్సిల్, స్టేషనరీ వరద బాధితుల విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు ఏబీవీపీ నేతలు పేర్కొన్నారు. ప్రయివేట్ స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలు ముందుకొచ్చి ఈ పని చేస్తున్నాయని తెలిపారు. ఏబీవీపీ కార్యకర్తలను ఎస్పీ ప్రశంసించి ఇలాంటి కార్యక్రమాలు రానున్న రోజుల్లో ఎన్నో చేయాలని వారు సూచించారు. ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి హర్షవర్ధన్ రెడ్డి, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్, కామారెడ్డి నగర కార్యదర్శి సంతోష్, నాయకులు సంజయ్, చరణ్, రాజు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలని వినతి

- బాన్సువాడలో రౌండ్ టేబుల్ సమావేశం


పోచారం, కాసుల బాల్‌రాజ్‌లకు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

బాన్సువాడ: ముదిరాజ్ కులస్తులను బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి మార్చేందుకు కృషి చేయాలని కోరుతూ బుధవారం బాన్సువాడలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని పాత బాన్సువాడ ముదిరాజ్ సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ మాట్లాడారు. తెలంగాణలో అత్యధిక జనాభా గల ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం వెంటనే ముదిరాజ్ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 15న కామారెడ్డిలో జరిగే బీసీ డిక్లరేషన్‌లో ముదిరాజ్ కులస్తులను బీసీ–ఏలోకి మార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వాలని అన్నారు. ముదిరాజ్ కులస్తులు గురువినయ్, జిన్న రఘు, లింగమేశ్వర్, కనుకుట్ల రాజు, డాకయ్య, భీమ గంగారం, కొంకి విఠల్, రాజేష్, దత్తు, కొంకి విఠల్, మొగులయ్య తదితరులున్నారు.

‘సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర కీలకం’


ఉత్తమ ఉపాధ్యాయులతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బాన్సువాడ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్య హబ్‌గా మార్చామన్నారు. నియోజకవర్గంలో రూ. 50 కోట్లతో 350 అదనపు తరగతి గదులను నిర్మించామన్నారు. దేశంలో ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలు 13 మంజూరైతే అందులో ఒకటి బాన్సువాడ నియోజకవర్గంలో ఏర్పాటు చేశామన్నారు. నర్సింగ్ కళాశాలలు జిల్లా కేంద్రాల్లోనే ఏర్పాటు చేస్తారని, కానీ పట్టుబట్టి బాన్సువాడకు మంజురు చేయించానని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ గుర్తు చేశారు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, పీఆర్‌టీయూ ప్రతినిధులు నరహరి, శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్, రవీందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులమంటూ బురిడీ

- మోసాన్ని గుర్తించి పోలీసులకు అప్పగించిన కాలనీ వాసులు


నకిలీ బ్యాంక్ అధికారులను నిలదీస్తున్న దాకయ్య

సదాశివనగర్: కామారెడ్డికి చెందిన ఓ ప్రైవేట్ బ్యాంక్ నుంచి తాము వచ్చామంటూ 25 మందిని బురిడీ కొట్టించి దొరికి పోయిన వారిని పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో చోటు చేసుకుంది. రూ.2,500 చెల్లిస్తే రూ.లక్షా50వేలు ఇస్తామని దానికి సంబంధించిన ఫారాలను నింపి బాధితుల నుంచి సంతకాలు సైతం తీసుకున్నారు. మూడు నెలల్లో రూ. 50వేలు చెల్లిస్తే మిగతా రూ. లక్ష చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పడంతో కాలనీకి చెందిన 25 మంది రూ. 2500 చెల్లించారు. కొంత మందికి అనుమానం రావడంతో మీరు కామారెడ్డిలోని ఏ బ్యాంక్ నుంచి వచ్చారని ప్రశ్నించారు. వారు తడబడుతూ ఓ ప్రైవేట్ బ్యాంక్ పేరు చెప్పారు. వెంటనే కాలనీవాసులు ఆ బ్యాంక్ అధికారులకు ఫోన్ చేసి మీ బ్యాంక్ పేరు మీద ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు వచ్చారని చెప్పగా వారు మా బ్యాంక్ సిబ్బంది కాదని తెలపడంతో పాటు వారిని కాలనీవాసులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారి నుంచి తీసుకున్న డబ్బులను ఇప్పించారు.

కదం తొక్కిన ఆదివాసి నాయక్‌పోడ్‌లు

- కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం ఆందోళన


మహమ్మద్ నగర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న నాయక్‌పోడ్ కులస్తులు

నిజాంసాగర్(జుక్కల్): ఎస్టీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం ఆదివాసీనాయక్‌పోడ్ కులస్తులు కదం తొక్కారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి నాయక్‌పోడ్ కులస్తులు ర్యాలీగా తరలి వచ్చారు. బస్టాండ్ ప్రాంతంలో బాన్సువాడ– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వని మహమ్మద్ నగర్ తహసీల్దార్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై శివకుమార్ ధర్నా వద్దకు చేరుకొని నాయక్‌పోడ్ కులస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని హామీ ఇచ్చేంతర వరకు కదిలేది లేదని వారు భీష్మించి కూర్చున్నారు. మహమ్మద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అక్కడి చేరుకొని నాయక్‌పోడ్‌కులస్తుల సమస్యను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఫోన్ ద్వారా తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో ధర్నాను విరమించుకొని తహసీల్ కార్యాలయం ముట్టడికి వచ్చారు. తహసీల్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి నాయక్‌పోడ్‌ల సమస్యలను తెలుసుకున్నారు. పదిహేను రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి వారి గ్రామాలకు వెళ్లారు. నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య, నేతలు భూమయ్య, శంకర్, సాయిబాబా, కాశీరాం తదితరులున్నారు.

గుండెపోటుతో స్కావెంజర్ మృతి

బాన్సువాడ: బాన్సువాడ ఉన్నత పాఠశాల (బాలుర)లో స్కావెంజర్‌గా పని చేస్తున్న గైనీ సునీత(32) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న సునీత ప్రతీ రోజులాగే పాఠశాలకు వచ్చింది. గుండెలో నొప్పిగా ఉందని ఆస్పత్రికి వెళ్తానని హెచ్‌ఎం రాణికి చెప్పి ఆమె వద్ద రూ. వెయ్యి తీసుకుని పాఠశాల నుంచి బయలుదేరింది. పాఠశాల గేటు దాటగానే ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే ఉపాధ్యాయులు గమనించి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గ్రామస్తుల ఆధ్వర్యంలోనే సల్మా బేగం అంత్యక్రియలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో మంగళవారం మృతి చెందిన సల్మా బేగం అంత్యక్రియలు బుధవారం గ్రామస్తులు, దత్తత తీసుకున్న కుమార్తె కరిష్మా చేతుల మీదుగా నిర్వహించారు. సల్మాబేగం మృతి చెందగా హైదరాబాద్ నుంచి ఓ వ్యక్తి వచ్చి తానే సల్మాబేగం కుమారుడని తానే అంత్యక్రియలు చేస్తానని తెలుపగా అందుకు గ్రామస్తులు అంగీకరించలేదు. అయితే దత్తత తీసుకున్న కరిష్మా బేగంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా తానే కొడుకునని చెప్పుకొనే వ్యక్తి అంత్యక్రియల అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన తన బంధువులతో కలిసి తిరిగి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

క్రైం కార్నర్

గోడకూలి ఒకరి మృతి


జాగీర్‌సింగ్ (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో గోడకూలి ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జాగీర్‌సింగ్(37) రేకుల షెడ్డుల నిర్మాణంతో పాటు షటర్లను తయారు చేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి జాగీర్‌సింగ్ ఇల్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో ఉంటున్నారు. బుధవారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తుండగా వర్షానికి కూలిన ఇంటి గోడ జాగీర్‌సింగ్‌పై పడింది. విషయాన్ని గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, అంధుడైన ఓ కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ ..


సావిత్రి (ఫైల్)

రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు గాండ్ల సావిత్రి అలియాస్ సాయమ్మ (52) అనే మహిళ పడి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయమ్మ మంగళవారం చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి జారి పడిపోయిందని తెలిపారు. బుధవారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాహనం పైనుంచి పడి యువకుడు..



ఖలీల్‌వాడి: నగరంలోని జడ్పీ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఖిల్లా రోడ్డుకు చెందిన మహేశ్(32) పని నిమిత్తం అశోక్ లీలాండ్ వెహికల్‌పై వస్తున్నాడు. డ్రైవర్ గాటే ఖండూ వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో వాహనం వెనకాల కూర్చొని ఉన్న మహేశ్ వాహనం పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు టన్నుల స్టీల్ చోరీ

నవీపేట: మండలంలోని యంచ శివారులో జరుగుతున్న జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 161)విస్తరణ పనుల కోసం డంప్ చేసిన స్టీల్ నుంచి పీరాజీ అనే వ్యక్తి 2 టన్నులు దొంగిలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పనులు నిర్వహిస్తున్న అనూష ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజర్ పార్థసారధి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సేవ చేసేందుకు ఇష్టం లేక హత్య

బోధన్‌రూరల్: వృద్ధురాలికి సేవ చేసేందుకు ఇష్టం లేని కుటుంబీకులు హత్య చేసిన ఘటన సాలూర మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి బోధన్‌రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర మండల కేంద్రానికి చెందిన కట్టం నాగవ్వ(65) అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు భర్త, కుమారులు లేకపోవడంతో మరిది చిన్న గంగారాం వద్ద ఉంటోంది. ఆమెకు సేవలు చేసేందుకు ఇష్టం లేని గంగారాం, భార్య, కుమారుడు గొంతు నులిమి హత్య చేశారు. వృద్ధురాలి వద్ద ఉన్న డబ్బు, బంగారం కోసమే నిందితులు హత్య చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రూరల్ పీఎస్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన సూరజ్‌రావు(22), అదే కాలనీకి చెందిన ఓ అమ్మాయి గత ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల ఆ అమ్మాయి వేరే యువకుడితో ప్రేమలో ఉందని తెలిసి తట్టుకోలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైల్వే గేటును ఢీకొన్న టాటా ఏస్



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ రైల్వే గేటును బుధవారం టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మధ్యలో విరిగిపోయింది. ఉదయం 11:30 ప్రాంతంలో రైలు వస్తుందని గేట్‌మన్ గేటు వేస్తుండగా గేటు దాటి త్వరగా వెళ్లాలని నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం గేటును ఢీకొన్నదని గేట్‌మన్ తెలిపారు. గేట్ మధ్యలో విరిగిపోవడంతో సిబ్బంది పునరుద్దరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక గేటు వేసి రైలు వచ్చిన ప్రతిసారి ప్రయాణికులను సిబ్బంది ఆపుతున్నారు. మరమ్మతులు ఇంకా పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఓ నాన్న నువ్వెక్కడున్నవే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- కుమారుడు దుబాయి నుంచి వస్తున్న రోజే ఘటన
- పద్మాజీవాడిలో విషాదం


బాలయ్య(ఫైల్)

సదాశివనగర్: నాన్న నేను మన ఊరికి వస్తున్న.. ఆ క్షేమంగా రా బిడ్డ నీకోసం మేమంతా ఎదురుచూస్తున్నాం అంటూ ఫోన్‌లో ప్రేమగా మాట్లాడిన ఆ తండ్రి ఇక లేడని తెలిసిన ఆ కుమారుడి హృదయం ఎంతో తల్లడిల్లిపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేని ఓ కుమారుడు దుబాయికి వెళ్లి మొదటి సారిగా ఇంటికి వస్తుండడంతో ఆ కుటుంబం ఎంతో సంతోషంతో నిండిపోయింది. మరుసటి రోజు కుమారుడు ఇంటికి చేరుతాడనే కొన్ని గంటల వ్యవధిలోనే మృత్యువు గుర్తు తెలియని వాహన రూపంలో తండ్రిని కబళించింది. ఈ ఘటన సదాశివనగర్ మండలం కుప్రియల్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పద్మాజీవాడి గ్రామానికి చెందిన మ్యాదరి బాలయ్య(53) ఆరేపల్లి శివారులోని ఓ ఆయిల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా దారి వెంట రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న బోధన్ ప్రాంతానికి చెందిన సయ్యద్ బాసిద్‌ను ఢీకొన్నాడు. దీంతో వాహనం అదుపు తప్పి బాలయ్య రోడ్డు పై పడడంతో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపునకు వస్తున్న గుర్తు తెలియని వాహనం అతనిపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ ఢీకొన్న ఘటనలో బాసిద్‌కు గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా బాసిద్ మతిస్థిమితం కోల్పోయి కొంత కాలంగా రోడ్డుపై తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం ఉదయం దుబాయి నుంచి స్వగ్రామానికి చేరిన కుమారుడు శివకుమార్ తండ్రి బాలయ్య మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. డాడీ ఫ్లయిట్ ఎక్కుతున్న అంటే జాగ్రత్తగా రా బిడ్డ అన్నవు.. నువ్వెక్కడున్నవే నాన్న అంటూ ఆ కుమారుడు రోదన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ పేర్కొన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: భార్యను మానసికంగా వేధించి కత్తితో గాయపర్చిన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సాయిసుధ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తురేకార్ రాజమణికి, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సిర్పూర్‌కు చెందిన సోన్ కాంబ్లె యాదవ్‌తో 2018 లో వివాహమైంది. కాంబ్లె మద్యం తాగుతూ భార్య సంపాదనపై ఆధారపడేవాడు. ఆమె నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండేది. 27మే2021న ఆస్పత్రికి వెళ్లి తన వెంట రావాలని గొడవ చేశాడు. దీంతో ఆమె రాను అనడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పోలీసులు కాంబ్లెపై కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానాను విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

భిక్కనూరు: డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఒకరికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోటాట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. యువకుడు మద్యం సేవించినట్లు రుజువు కావడంతో జడ్జి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై సూచించారు.

డిచ్‌పల్లి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ వ్యక్తికి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ బుధవారం తెలిపారు. డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో ఈ నెల 8న నాగ్‌పూర్ గేట్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ధర్మారం(బి) గ్రామానికి చెందిన గుర్రాల నర్సయ్య డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. వివరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నర్సయ్యకు మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.